క్లుప్తంగా

28న ఉచిత మెగా వైద్యశిబిరం

గరుగుబిల్లి: తోటపల్లిలోని జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో ఈనెల 28న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీటీడీ సేవా ట్రస్టు సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, రాగోలులోని జెమ్స్ ఆస్పత్రి, తోటపల్లి టెంపుల్స్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లు, కంటి సమస్యలతో పాటు, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎల్‌డీఓ పరిశీలన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

పాలకొండ: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందని, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని డీఎల్‌డీఓ గోపాలకృష్ణ సూచించారు. నగరపంచాయతీలోని రామకళామందిర్ వీధి సచివాలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. పౌరసేవలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు.

విద్యార్థులకు కళ్లద్దాలు అందజేత



కళ్లద్దాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. గతేడాది నవంబర్ 23న నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేసి 620 మంది బాలికలకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 33 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కుశిమి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం కళ్లద్దాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల పాల్గొన్నారు.

నేడు అఖండ అన్నసంతర్పణ

వీరఘట్టం: స్థానిక గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం అఖండ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యం శుక్రవారం హోమం గుండం వద్ద భక్తులు పూజలు చేశారు. మహిళలు సంతోషిమాతకు కుంకుమపూజలు చేశారు.

బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

వీరఘట్టం: ఈ ఏడాది మార్చి 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 1319 మంది పట్టభద్రులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వారంతా వీరఘట్టం బాలికోన్నత పాఠశాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

యువతికి సాయం



అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి సాయమందిస్తున్న నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి పంచాయతీ రుషికాలనిలో తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన బిడ్డిక మణి అనే గిరిజన యువతికి వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నిమ్మక గోపాల్ (గుమ్మలక్ష్మీపురం గ్రామం) తన వంతు సాయాన్ని అందించారు. ఈనెల 20న సాక్షి దినపత్రికలో మూడేళ్లుగా మంచానికే పరిమితం అనే శీర్షికతో వచ్చిన కథనానికి చలించిన గోపాల్ శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి వెస్టైన్ సీటర్, వాకర్‌తో పాటు ఆర్థిక సాయం అందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సాలూరు: పాచిపెంట, సాలూరు మండలాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. అన్నంరాజువలస పంచాయతీలో దాదాపు రూ.9.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టగా, చీపురువలస గ్రామంలో కొండ నుంచి వస్తున్న నీటిని మళ్లించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించారు. అలాగే పాచిపెంట మండలంలోని పనుకువలస పంచాయతీలో సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పీటీజీ గ్రామాల్లో సీసీడీపీ గ్రాంటు ద్వారా చేపట్టిన ఆయా నిర్మాణాలను చూసిన ఆయన పనుల్లో నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

బోధకులపై భారం తగ్గేలా..

- ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి ఉపశమనం
- ఏపీఎంలకు విద్యారంగం పథకాల అమలు బాధ్యతలు
- ప్రభుత్వ బడుల్లో మరింత మెరుగుపడనున్న బోధన



అంపిలి ప్రాథమికోన్నత పాఠశాలలో బోధనలో నిమగ్నమైన ఉపాధ్యాయుడు



అన్నవరం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులు

పాలకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. అన్నివర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అనేక పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోంది. వాటి పర్యవేక్షణ బాధ్యతల భారం నుంచి ఉపాధ్యాయులను తప్పించి వారిని కేవలం బోధనకే పరిమితం చేయాలని నిర్ణయించింది. పథకాల పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డీఆర్డీఏలో సెర్ప్ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు (ఏపీఎం) పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండల విద్యాశాఖాధికారుల సమన్వయంతో వారికి అప్పగించిన విధులను నిర్వర్తించేలా మార్గదర్శకాలను నిర్దేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని 1699 పాఠశాలల్లో 1,21,691 మంది విద్యార్థులకు, 6,432 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది.

ఇరుశాఖల సమన్వయంతో..

విద్యారంగంలోని పథకాల అమలులో జిల్లా, మండల విద్యా శాఖలోని అధికారులకు ఏపీఎంలు సహకరిస్తారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీతో పాటు స్కాలర్‌షిప్‌లు, ధ్రువీకరణ పత్రాల జారీలో సహకారం అందిస్తారు. దీంతో ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గుతుంది. ఇక నుంచి టీచర్లు అకడమిక్, ఇతర నిర్వాహక వ్యవహారాలను మాత్రమే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న ప్రతి పాఠశాలను ఏపీఎంలు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

పాఠశాల స్థాయిలో..

ఏపీఎంలు పాఠశాల స్థాయిలో పలు కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. వాటిలో మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాల సక్రమ నిర్వహణ కోసం బడ్జెట్ కేటాయింపు, నీతిఅయోగ్ సీఎస్ఆర్ ద్వారా మౌలిక వసరుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు కోసం నూతన జాతీయ విద్యా విధానం ద్వారా పాఠశాలల మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు ఆన్‌లైన్–డిజిటల్ పాఠాలు అందించడం, తరల్, సాల్ట్, లిప్, సిప్, దీక్షా, జోలీ ఫోనిక్స్ వంటివి ఉన్నాయి.

ఏపీఎంల బాధ్యతలు ఇలా..

- గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించాలి.
- జగనన్న అమ్మఒడి పథకం కోసం అర్హులైన తల్లులను గుర్తించాలి.
- పాఠశాలలో విద్య, వైద్య, రక్షణ బాధ్యతల పర్యవేక్షణ.
- ఉపాధ్యాయుల జీతాలు, సెలవుల మంజూరు. ట్రెజరీ పనులు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో నిర్వహించే సమీక్షా సమావేశాలకు హాజరు.
- జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలు చేయడం.
- మరుగుదొడ్ల నిర్వహణ, నిధి కార్యకలాపాల పథకాల పర్యవేక్షణ.
- పాఠశాల పరిధిలోని డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్ భద్రత, వాటి పర్యవేక్షణ.
- స్వాతంత్ర్య, గణతంత్ర, ఉపాధ్యాయ, బాలలదినోత్సవాల వంటి కార్యక్రమాల నిర్వహణ.

	జిల్లాలో పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య ఇలా
ప్రాథమిక పాఠశాలలు	1320	40084
ప్రాథమికోన్నత పాఠశాలలు	153	15407
ఉన్నత పాఠశాలలు	226	66200
మొత్తం	1,699	1,21,691

పనిభారం తగ్గుతుంది



పాఠశాలల్లో సంక్షేమ పథకాల అమలుతీరును ఏపీఎం పర్యవేక్షణకు అప్పగించటం జరిగింది. ఎస్‌హెచ్‌జీ సంఘాల్లో వారికి ఉన్న సఖ్యతతో విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరిచి డ్రాపౌట్స్ నివారణ, పాఠశాలలో సర్కారు పథకాలను పారదర్శకంగా అమలు జరిగేలా చూడడంతో సమన్వయంతో ముందుకు వెళుతున్నాం. విద్యా వ్యవస్థతోపాటు నూతనంగా ఏపీఎంలు తోడవ్వటంతో ఉపాధ్యాయులకు, డిప్యూటీ డీఈఓలకు, ఎంఈఓలకు కొంతమేరా పనిభారం తగ్గుతుంది. – ఎస్‌డీవీ రమణ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

పర్యవేక్షణ చేపడుతున్నాం



ప్రభుత్వ బడుల్లో పథకాల అమలు పర్యవేక్షణకు మండలానికి ఒక ఏపీఎంను నియమించటం జరిగింది. వారికి ఇదివరకే ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ క్రమంలో వారు తమ విధులతోపాటు పాఠశాలల్లో ప్రభుత్వం సూచించిన విధానాల అమలుకు కృషిచేస్తున్నారు. వారు అందించిన నివేదికలను మేము మరోమారు పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాం. – పెద్దింటి కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

వైభవంగా మెహర్‌బాబా జయంతి



తిరువీధి కార్యక్రమం

పాలకొండ రూరల్: అవతార్ మెహర్‌బాబా 129వ జయంతి వేడుకలు పాలకొండలో వైభవంగా జరిగాయి. స్థానిక మందిరంలో శుక్రవారం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తిరువీధి కార్యక్రమం, అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాలను బాబా భక్త బృందం అధ్యక్షుడు వి.మృత్యుంజయరావు, కార్యదర్శి టి.మన్మథరావు పర్యవేక్షించారు.

సీపీఎం నేతల నిరసన



పాలకొండ: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



జియ్యమ్మవలస: ధర్నా చేస్తున్న సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పాలకొండ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసన తెలుపుతూ సీపీఎం నేతలు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ దావాల రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయం, వైద్య, విద్యారంగాలకు నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించిన నిధుల కేటాయింపులో భారీగా కోత విధించిందని ఆరోపించారు.

- **జియ్యమ్మవలస:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్యకర్తలతో కలిసి ధర్నా చేపట్టారు. 2023–24 సంవత్సర బడ్జెట్‌తో పేదలకు ఎటువంటి మేలు జరిగదన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న హెచ్‌ఎం నాగరాజు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎల్.నాగరాజు అన్నారు. పాఠశాలలో ఫేర్‌వేల్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ప్రణాళికతో చదివితే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

కురుపాం: మహిళా సంఘాలకు బ్యాంకులు ఇస్తున్న రుణాలు, లింకేజీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి క్లస్టర్ పరిధిలోని పొదుపు సంఘాలతో శుక్రవారం సమావేశమయ్యారు. సంఘాలకు సంబంధించి క్రెడిట్ యుటిలైజేషన్, క్యాష్ ఫ్లో స్టడీపై సమీక్షించారు. సంఘం పొదుపు, రుణాలు, ఆర్థిక పరిపుష్టిపై ఆరా తీశారు. రుణాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నారని సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిశోర్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బొద్దిడి జంక్షన్(దుమ్మంగి) వద్ద ఉన్న పంచవర్ణేశ్వరస్వామి పంచమరాత్రి మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు శివపార్వతులకు ప్రత్యేక పూజలతో పాటు కల్యాణం చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ సమావేశం

సీతంపేట: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు డి.రమణారావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. యూనియన్ మండల అధ్యక్షుడు ఎస్.సురేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

యథాతథంగా గ్రామదేవత పండగ

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇటీవల యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ముహూర్తం ఖరారు చేశారు. ఈ ఏడాది మే 7,8,9 తేదీల్లో పండగను చేపట్టేందుకు గ్రామ పెద్దల సమక్షంలో నిశ్చయించారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు వీరఘట్టం గ్రామదేవత పండగ ఆగిపోయిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారి మాటలను ఎవరూ నమ్మొద్దని ఉత్సవ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే పెండింగ్‌లో ఉన్న వీరఘట్టం ప్రధాన రహదారి నిర్మాణం, కాలువల నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆర్ అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. ప్రజలందరి సహకారంతో పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రామదేవత ఆలయ ప్రారంభం



వనంగుడిలో ప్రతిష్ఠించిన పైడిమారమ్మ విగ్రహం

కురుపాం: మండల కేంద్రంలోని పైడిమారమ్మ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణదాత కొత్తకోట వెంకట సురేష్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించగా.. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఎమ్మెల్యేకు ఉరిటి కృతజ్ఞతలు



ఉరిటి రామారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగంలో బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఉరిటి రామారావు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం చినమేరంగిలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆయన్ను సత్కరించి, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేయాలని సూచించారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: ప్రభుత్వం నిర్దేశించిన గోరుముద్ద పథకం మెనూ కచ్చితంగా అమలు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని చినఖేర్జిల గిరిజన సంక్షేమ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ చేయొద్దని, ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న మంచలవలస రోడ్డు పనులను పరిశీలించారు. ఇచ్చిన కొలతల మేరకు పనులు పూర్తిచేసినట్లయితే గిట్టుబాటు వేతనం లభిస్తుందని వేతనదారులకు సూచించారు.

బాలేరులో ఇంటింటికీ తాగునీటి కుళాయి



బాలేరులో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు

భామిని: మండలంలోని బాలేరులో జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులు పూర్తికావచ్చాయి. గ్రామంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నామని, రానున్న వేసవిలో ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేస్తామని సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై బి.శివప్రసాద్ కోరారు. మండలంలోని మంగళాపురం కూడలి వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర బడ్జెట్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గరుగుబిల్లి: కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ బీజేపీ విధానాలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందని మండిపట్టారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు, ఉపాధిలేక వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని సూచించారు. నిసరనలో సీపీఎం నాయకులు కె.రవీంద్ర, సూర్యనారాయణ, పాడినాయుడు తదితరులున్నారు.

సాయి భక్తుల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పాలకొండ రూరల్: స్థానిక శ్రీశైనవీధిలో ఉన్న సత్యసాయి శివం మందిరంలో షిర్డీసాయి విగ్రహం ఏర్పాటుకు భక్తులు విరాళాలు అందజేశారు. పట్టణానికి చెందిన దుప్పాడ గణేష్ రూ.16,500, ఎం.చంద్రశేఖర్ రూ.10వేలును ఆలయ కన్వీనర్ ఉత్తరావెల్లి ప్రభాకరరావుకు శుక్రవారం అందజేశారు. మందిరంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సత్సంగ్‌లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా ప్రవచనాలను కీర్తించారు.

పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

సీతంపేట: మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ కోసూరు గీతాంజలి శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్ట్‌లను పర్యవేక్షించారు. పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాలమానుగూడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వేతనదారులకు వందరోజుల పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.257 వేతనం వచ్చేలా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

సీతంపేట: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై నీలకంఠం సూచించారు. ఐటీడీఏ వద్ద శుక్రవారం రోడ్డు సేఫ్టీపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, పరిమిత వేగంతో ప్రయాణించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఈఈ రమణ, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని పీఆర్‌రాజుపేట గ్రామంలో టీటీడీ దేవస్థానం వారి సహకారంతో దేవాలయం నిర్మాణానికి సంబంధిత అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ హెచ్‌వీ రమణ నేతృత్వంలో అధికారులు గ్రామంలో పర్యటించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు.

వేసవి సమస్యలు అంచనా వేయండి



బెజ్జి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తలెత్తే సమస్యలను ముందుగా అంచనా వేయటం ద్వారా వాటిని అధిగమించవచ్చని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని అట్టలి, వాటపాగు, బెజ్జి, టీకే.రాజపురం పంచాయతీలను శుక్రవారం సందర్శించారు. సిబ్బందితో సమావేశమై ఎస్‌డీజీ సర్వేతోపాటు పీఎంజేఏవై పథకం తీరుతెన్నులు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల బట్వాడా తాజా పరిస్థితితులపై సమీక్షించారు. ఆయనతోపాటు సర్పంచులు, వావిలపల్లి రాజారావు, శివ్వాల శ్రీనివాసరావు తదితరులున్నారు.